


PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక: 52 ఎడిటర్: రాపోలు లింగస్వామి 22 -10 -2026 గురువాం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00

## డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ పోలీసుల పనితీరు భేష్

హైదరాబాద్: తెలంగాణ పోలీసుశాఖ జాతీయ స్థాయిలో తొలిస్థానం దక్కించుకుందని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ కట్టడిలో రాష్ట్ర పోలీసుశాఖ పనితీరు బాగుందని ప్రశంసించారు. గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ స్మారక పరేడ్ కార్యక్రమానికి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు నివాళులర్పించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని, టిజి సేఫ్ ద్వారా ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నామని వెల్లడించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే నేరస్థులతో స్నేహంగా ఉండటం కాదని..బాధితులు, సామాన్య ప్రజల పట్ల పోలీసులు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, నేరస్థులు, కబ్జాదారులు, డ్రగ్ పెడ్లర్ల పట్ల కఠినంగా ఉండాలని సూచించారు.పోలీసుశాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి పోలీసుశాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామని అన్నారు. పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి మంజూరు చేశామని, మిగిలిన ఖాళీలను విడతల వారీగా భర్తీ చేస్తామని, 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అలాగే, 112 మంది డీఎస్పీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించామని, పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను



హోదాను బట్టి రూ.కోటికి పైగా పెంచామని రేవంత్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి ఈ ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసులను సమాజం ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగించాలని, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## దుర్గామాత నిమజ్జనాలు..

హైదరాబాద్: నగరంలో దుర్గా మాత విగ్రహాల నిమజ్జనం సంద




ర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు విధించారు. పలు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లిస్తున్నారు. పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, జలవిహార్, సంజీవయ్య పార్క్ బేబీ పాండ్స్ వద్ద విగ్రహాల నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో పంజాగుట్ట, రాజ్ భవన్ వైపు నుంచి ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌కు వచ్చే వాహనాలను ఇతర మార్గాల్లోకి మళ్లిస్తున్నారు. వి.వి. విగ్రహం వద్ద ట్రాఫిక్‌ను నిరంకారి జంక్షన్ వైపు పంపిస్తున్నారు. ఇక్బాల్ మినార్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి నిరాకరించారు. నిమజ్జనానికి వచ్చే విగ్రహాల వాహనాలకు మాత్రమే అనుమతి కల్పిస్తున్నారు. పాత పోలీస్ స్టేషన్ సైఫాబాద్ వద్ద వాహనాలను రవీంద్ర భారతి, మాసాబ్‌ట్యాంక్ వైపు మళ్లిస్తున్నారు. ఖైరతాబాద్ బడా గణేశ్ లేన్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అప్పర్ ట్యాంక్ బండ్ నుంచి వచ్చే వాహనాలను లిబర్టీ వైపు మళ్లిస్తున్నారు. లిబర్టీ నుంచి సెక్రటేరియట్ జంక్షన్ వైపు సాధారణ వాహనాలకు అనుమతి ఉండదు. నల్లగుట్ట బ్రిడ్జ్, పీవీ మార్గ్ వైపు నుంచి వచ్చే ట్రాఫిక్‌ను మినిస్టర్ రోడ్డు వైపు మళ్లిస్తున్నారు. రాణిగంజ్, మినిస్టర్ రోడ్డు నుంచి నెక్లెస్ రోడ్డు వైపు వచ్చే వాహనాలకు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. సెక్రటేరియట్ జంక్షన్ పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు పలు చోట్ల మళ్లింపులు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమాలకు వచ్చే భక్తులు, నగర ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవడంతో పాటు ట్రాఫిక్ పోలీసుల సూచనలు, ఆదేశాలను పాటించాలని కోరుతున్నారు. నిమజ్జన ప్రాంతాల పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు సహకరించి ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పడాలని అధికారులు సూచిస్తున్నారు.

## మంత్రులు, ఎమ్మెల్యేల పీఏల వసూళ్ల దందా?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పనిచేస్తున్న వ్యక్తిగత సహాయకుల (పీఏల) వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారింది. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి కొందరు పీఏలు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపాయింట్‌మెంట్ ఇప్పించడం నుంచి సిఫారసు లేఖలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించడం వరకు ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించినట్లు ప్రచారం



జరుగుతోంది. కాంట్రాక్టర్లు తమ బిల్లుల మంజూరు కోసం ప్రజాప్రతినిధులను కలిసేందుకు ప్రయత్నించినప్పుడు, సిఫారసు లేఖలు ఇప్పించడం, టోకెన్ జాబితాలో పేర్లు చేర్చడంవంటి పనుల కోసం భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల కార్యాలయాలకు వచ్చే సామాన్యులు సైతం వివిధ అవసరాల కోసం డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. శ్రీవారి దర్శనానికి సిఫారసు లేఖ కోసం రూ.5 వేలు, సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు అప్‌లోడ్ చేసేందుకు రూ.3 వేలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎక్కువ మొత్తంలో ఆర్థిక సాయం ఇప్పించేందుకు 10 శాతం వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఓపెన్ స్పెషల్ పికప్ శాంక్షన్ కోసం రూ.లక్ష, గురుకులాలకు నీటి సరఫరా పనుల కోసం రూ.10 వేలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులకు సిఫారసు లేఖల కోసం కనీసం రూ.2 లక్షలు అడుగుతున్నారనే ప్రచారం ఉంది. కళాశాల ఫీజు తగ్గింపునకు సిఫారసు లేఖ కోసం రూ.5 వేలు తీసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల్లో పోస్టింగ్‌ల సిఫారసుల కోసం కూడా భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సీఐ స్థాయి అధికారికి ఫోన్ చేసి కేసు నమోదు కాకుండా చూడాలంటే రూ.10 వేలు, ఉన్నతాధికారులను సంప్రదించేందుకు అంతకంటే ఎక్కువ మొత్తం అడుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల్లోని అధికారులతో పరిచయాలు పెంచుకుని, తమ మాట ప్రకారమే పనులు జరిగేలా కొందరు పీఏలు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులతో సాయం కోసం ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చే వారిని సైతం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతున్నాయి. ప్రజాసేవ చేయాల్సిన కార్యాలయాల్లో ఇలాంటి వసూళ్ల ఆరోపణలు రావడంచర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగితేనే నిజానిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థి ఖరారు

వరంగల్ జిల్లా: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి తెలంగాణ రక్షణ సేన అభ్యర్థిని ఖరారు చేసింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను



తమ అభ్యర్థిగా పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీకాంత్ గౌడ్ పేరు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు, ఈ ఎన్నికల దృష్ట్యా వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను లక్ష్యంగా చేసుకుని ఎన్నికల కార్యాచరణను కవిత ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, ప్రచార వ్యూహాల సమన్వయం కోసం సయ్యద్ ఇస్మాయిల్‌ను ఎన్నికల కోఆర్డినేటర్, అబ్జర్వర్‌గా నియమించారు కవిత. ఎన్నికలకు సంబంధించి పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం, ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. దసరా సందర్భంగా అభ్యర్థి ప్రకటనతో పాటు ఎన్నికల బాధ్యతలనూ తెలంగాణ రక్షణ సేన ఖరారు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రానున్న రోజుల్లో పట్టభద్రుల మద్దతు కూడగట్టేందుకు పార్టీ ఎలాంటి కార్యాచరణ చేపడుతుంది, అభ్యర్థి ప్రచారాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారన్నది మరింత ఆసక్తికరంగా మారింది. తెలంగాణ రక్షణ సేన నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పేరు ఖరారు కావడంతో వరంగల్-ఖమ్మం-నల్లగొండ రాజకీయాల్లో ఈ ప్రకటన చర్చనీయాంశంగా మారింది.

## డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగుతోంది. ఎన్‌హెచ్‌ఎం ఉ




ద్యోగుల సమ్మె9వ రోజుకు చేరింది. హైదరాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్) ఉద్యోగుల నిరసన కొనసాగిస్తున్నారు. తెలంగాణలో రెగ్యులరైజేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. హెల్త్ కార్డులతోపాటు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి ఎన్‌హెచ్ ఎం ఉద్యోగులు భారీ ఎత్తున తరలివచ్చారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చశారు. మరోవైపు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు నిరవధిక సమ్మె కొనసాగుతోంది. పండగ రోజు నల్లబ్యాడ్జీలు ధరించి.. గొడ్డు కారంతో భోజనం చేస్తూ వినూత్నంగా నిరసన తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్చలకు పిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సంపాదకీయం

## వెలుగుల ప్రస్థానం చీకట్లలోకి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తీవ్రమైన విద్యుత్తు కొరతను ఎదుర్కొన్నది. వ్యవసాయానికి రోజుకు సుమారు ఆరు గంటల విద్యుత్తును రెండు విడతల్లో సరఫరా అయ్యేది. పరిశ్రమలకు వారానికి రెండు రోజుల విద్యుత్తు సెలవులు ఉండేవి. గృహ వినియోగదారులు కూడా విద్యుత్తు కోతలను ఎదుర్కొనేవారు. రైతులు రాత్రి పూట పొలాల్లో కరెంటు కోసం పడిగాపులు కాసేవారు. తక్కువ ఓల్టేజీతో మోటార్లు కాలిపోవడం,ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, నీరు అందక పంటలు ఎండిపోవడం వంటి సమస్యలు చాలా ప్రాంతాల్లో కనిపించేవి. పరిశ్రమల్లో ఉత్పత్తి నిలిచిపోయేది. డీజిల్ జనరేటర్లపై ఆధారపడటంతో ఖర్చులు పెరిగి,ఉపాధి అవకాశాలు దెబ్బతినేవి. కానీ విద్యుత్తు రంగ సమస్యలన్నింటినీ కేసీఆర్ సర్కార్ పరిష్కరించింది.కానీ నేడు కాంగ్రెస్,తెలుగుదేశం పాలించిన'ఆనాటి రోజులు' మళ్లీ వచ్చాయి.సమైక్య రాష్ట్రంలో విద్యుత్తురంగంలో తెలంగాణ అరిగో పడ్డది. చంద్రబాబు పాలనలో విద్యుత్తు ఛార్జీల పెంపు రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిది.సర్కార్ విద్యుత్తు విధానాలకు వ్యతిరేకంగా రైతుల పోరాటం ఉవ్వెత్తున సాగింది. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో చంద్రబాబు సర్కార్ కర్కషంగా కాల్పులు జరిపింది. ఆ ఘటనలో ముగ్గురు మరణించగా, దాదాపు 200 మంది గాయపడ్డారు. సమైక్య రాష్ట్రంలో విద్యుత్తు సమస్యలు తెలంగాణ ప్రజల జీవితాలను ఎంతగా పట్టిపీడించాయో తెలిపేందుకు ఈ ఘటన నిదర్శనం.ఆ కాల్పులను నిరసిస్తూ నాటి డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న కేసీఆర్, చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. ఆ తర్వాత ఉద్యమ బాటపట్టారు.కేసీఆర్ పాలనలో విద్యుత్తు రంగ విస్తరణ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం కరెంటు కొరతను అధిగమించేందుకు ప్రత్యేక ప్రణాళికలను అమలు చేసింది. విద్యుత్తు కొనుగోళ్లు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం,సౌర విద్యుత్తు విస్తరణ, ట్రాన్స్‌మిషన్,పంపిణీ వ్యవస్థల బలోపేతంపై దృష్టి పెట్టింది.కేసీఆర్ ప్రగతిభవన్‌లో తాను కూర్చునే కుర్చీ ఎదురుగా విద్యుత్తుకు సంబంధించిన వివరాలను స్క్రీన్‌పై చూస్తూ, అధికారులతో మాట్లాడుతూ సూచనలు చేసేవారు.నాణ్యమైన విద్యుత్తును నిరంతరం అందించడం కోసం సమీక్షలు నిర్వహించేవారు.అలాంటి విజన్‌తోనే తెలంగాణను వెలుగులు విరజిమ్మే రాష్ట్రంగా తీర్చిదిద్దారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు 24 గంటలు సరఫరా చేశారు. పరిశ్రమలకు విద్యుత్తు సెలవులు తొలగించారు. తెలంగాణ విద్యుత్తు విధానంలో రైతులకు భరోసా,పరిశ్రమలు,ఐటీ సంస్థలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం ముఖ్యమైన అంశాలు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకటి కాలం వస్తుందని గతంలో చెప్పిన నాయకులే, విద్యుత్తు రంగంలో సాధించిన పురోగతిని గుర్తించి పొగిడిన సందర్భాలూ చూశాం. కేసీఆర్ పాలనలో రాష్ట్ర ఆదాయం పెరగడంతోపాటు ప్రజల తలసరి ఆదాయంలో గణనీయ పురోగతికి విద్యుత్తు కీలకంగా నిలిచింది.యాదాద్రి థర్మల్ ప్లాంట్ యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ తెలంగాణ విద్యుత్తు భద్రతకు కీలకం. ఈ ప్లాంటుకు అవసరమైన బొగ్గు నాణ్యత, పరిమాణం, రవాణా, నిల్వలపై ముందస్తు ప్రణాళిక అత్యవసరం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అవసరమైన బొగ్గు నిల్వలను సమకూర్చుకోలేదు. ఈ నెల 16 నాటి వార్తా కథనాల ప్రకారం, రాష్ట్రలోని థర్మల్ విద్యుత్తు కేంద్రాల వద్ద 6.41 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్ర మే ఉండగా, రోజువారీ వినియోగం సుమారు 74,800 టన్నులుగా ఉన్నది.ఈ నిల్వలు సుమారు 9 రోజులకు సరిపోతాయని, యాదా ద్రి ప్లాంటు వద్ద ఐదు రోజులకు సరిపడా నిల్వలే ఉన్నట్టు తెలుస్తున్నది.సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నిబంధనల ప్రకారం కనీసం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉంచుకోవాల్సిన భాధ్య త ఉత్పత్తి సంస్థలపై ఉన్నది. అలా లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమే. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, నాణ్యత, రవాణా, నిల్వల నిర్వహణ రా ష్ట్ర విద్యుత్తు భద్రతకు కీలకం. కానీ నిల్వలు తగ్గిన తర్వాత సమీక్షలు నిర్వహించడం ఏంటి? రైతు లు, ప్రజలపై సోయిలేని ప్రభుత్వ నిర్వాకమిది.విదేశీ బొగ్గు దిగుమతి వివాదం విదేశీ బొగ్గు దిగుమతి ఏర్పాట్లపై స్వతంత్ర విచారణ జరిపించాలని, ఒప్పందాలు,ధరలు,టెండర్లు,ప్రైవేట్ లాజి స్టిక్స్ సంస్థల పాత్రను వెల్లడించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో విచారణకు ఆదేశిస్తే అన్ని ఆధారాలు అందజేస్తామని చెప్పారు. విదేశీ బొగ్గు కొనుగోలు చేయడం కంటే ముందు, దేశీయ బొగ్గు లభ్యత ఎంత? దిగుమతులు ఎందుకు అవసరమయ్యాయి? కొనుగోలు ధరలు ఎలా నిర్ణయించారు? రవాణా ఖర్చు ఎంత? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలి.రైతులకు విద్యుత్తు కష్టాలు ఎందుకు?రెండు నెలలుగా విద్యుత్తు అంతరాయాలపై రైతులు నిరసనలు తెలుపుతున్నారు.కానీ సంక్షో భం వచ్చిన తర్వాత సీఎం అధికారుకుఆదేశాలు ఇవ్వడం నిర్లక్ష్యమే.ఎల్ నినో ప్రభావం తీ వ్రంగా ఉంటుందని తొమ్మిది నెలలుగా వాతావరణ, నీటిపారుదల నిపుణులు చెప్తూ వస్తున్నారు. ఆ హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. కాళేశ్వరం నీళు ఎత్తాలని సూచించిన రిరైర్డ్ ఇంజినీర్లకు బెల్ట్ ట్రీట్మెంట్ ఇవ్వాలని వ్యాఖ్యానించడం రేవంత్ తెలివితక్కువతనానికి నిదర్శనం. ఎన్నో వి ద్యుత్తు సంస్కరణలు తెచ్చిన ఘనత కేసీఆర్‌ది అయితే, వాటిని నిలబెట్టలేని చేతకాని పాలన రేవంత్‌రెడ్డిది.సంక్షోభ పరిష్కారానికి ఏం చేయాలి? హైదరాబాద్ సహా తెలంగాణలో డాటా సెంటర్లు, కృత్రిమ మేధస్సు మౌలిక సదుపాయాలు, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు పెట్టుబడులను ఆకర్షించడం అభివృద్ధికి ఉపయోగకరం.

# మన కన్నీటిని తుడిచేవారు

మన కన్నీటిని తుడిచేవారు కొందరుంటారు,
మన బాధను చూసి ఓదార్చేవారు మరికొందరుంటారు,
బంధువులమంటూ దగ్గరయ్యే వాళ్లెందరో,
మనసున్న మనుషులుగా నిలిచేవారు కొందరే!
ఆపదలో అండగా నిలిచే చేయి విలువ వేరు,
ఆప్యాయంగా పలికే మాటలోని బలం వేరు,
కష్టకాలంలో తోడుంటేనే తెలుస్తుంది,
మన చుట్టూ ఉన్న బంధాల అసలు రంగు!
సంతోషంలో నీ వెంట నడిచేవారు ఎందరో,
కన్నీటిలో నీ చేయి పట్టేవారు అరుదు,
నీ నవ్వులో భాగం పంచుకునేవారు చాలామంది,
నీ మౌనంలోని బాధను చదివేవారు కొందరే!
మనసు విరిగిన వేళ మందులా మారేవారు,
మన ఆశలు కూలిన వేళ ధైర్యమై నిలిచేవారు,
లోకం నిన్ను ఒంటరిని చేసిన క్షణంలో,
నీకు నేనున్నానని భరోసా ఇచ్చేవారే నిజమైనవారు!
ప్రతిఫలం ఆశించకుండా ప్రేమను పంచేవారు,
ప్రయోజనం లేకున్నా పలకరించే మనసున్నవారు,
నీ కన్నీటికి కారణం అడగకముందే,
దాన్ని తుడిచే చేయి చాచేవారే ఆత్మీయులు!
మనిషి గొప్పతనం సంపదలో కనిపించదు,
మనసులోని మంచితనంలోనే వెలుగుతుంది,
ఎదుటివారి కన్నీటిని తనదిగా భావించే హృదయం,
వెయ్యి గుడుల పుణ్యానికన్నా గొప్పది!
అందుకే బంధాల విలువను మాటలతో కొలవకు,
ఆపదలో వారు చూపే ఆప్యాయతతో తెలుసుకో,



నీ కన్నీటిని తుడిచే ఒక్క మంచి మనిషి చాలు,
వందమంది పరిచయాలకన్నా ఆ బంధమే మేలు!

**రచన : అందే శ్రీనివాస్**
**యస్.వి.ఆర్.స్కూలు కరస్పాండెంట్, నెల్లూరు.**

# మనిషి-మనసు-ముసుగు

మనిషి ని కొలిచే కొలమానం అతని సంపద కాదు,
సంస్కారం! వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేది వేషధారణ కాదు,
అంతరంగం! మృదుభాషణం వెనుక దాగి ఉండొచ్చు విషపూరిత వైఖరి,
మందహాసం మాటున పొంచి ఉండొచ్చు మర్మఘాతక కుటిలనీతి!
ప్రశంసల పల్లకిలో ఊరేగినంత మాత్రాన ప్రాభవం రాదు,
పరుల పతనాన్ని కాంక్షించే పాషాణ హృదయానికి పుణ్యం దక్కదు!
స్వార్థపు సింహాసనంపై సత్యాన్ని బలిచేసినవాడు,
కాలగర్భంలో తన కపట చరిత్రను తానే లిఖించుకున్నవాడు!
అవసరాల అగ్నిలో అనుబంధాలను ఆహుతి చేసేవాడు,
ఆపదొచ్చిన వేళ ఆత్మీయతకు అర్థం మార్చేవాడు!
నమ్మకపు నిధిని దోచే నయవంచక నరరూప రాక్షసుడు,
నైతికతను నలిపేసే నికృష్ట ప్రవర్తనకు ప్రతిరూపుడు!
మాటల మాంత్రికత్వంతో మనసులను మభ్యపెట్టవచ్చు,
మోసపు ముసుగుతో కొంతకాలం వాస్తవాన్ని కప్పిపుచ్చవచ్చు!
కానీ కాలమనే కఠోర న్యాయమూర్తి తీర్పు వెలువరించిన వేళ,
కృత్రిమ కీర్తి కూలిపోతుంది క్షణకాలంలోనే నేల!
అహంకారపు అంబరాన్ని అధిరోహించిన అధముడైనా,
అనుభవాల సమరంలో ఆత్మపరిశీలనకు తలవంచక తప్పదు!
పదవుల ప్రాభవం శాశ్వతం కాదు,అధికార మదం అజేయం కాదు,
పరుల కన్నీటి పునాదులపై నిర్మించిన వైభవం చిరస్థాయి కాదు!
వివేకం లేని విజ్ఞానం వినాశనానికి బీజమవుతుంది,
వినయం లేని విజయం విపత్కర పరిణామాలకు దారితీస్తుంది!
ఔన్నత్యం అనేది ఎదుటివారిని అధఃపాతాళానికి నెట్టడం కాదు,
ఉదాత్తత అంటే ఊడిగం చేయించడం కాదు, ఊతమివ్వడం!
క్షమాగుణం బలహీనత కాదు, అది సంయమనపు సామ్రాజ్యం,
ఆత్మగౌరవం అహంకారం కాదు, అది వ్యక్తిత్వపు సౌధం!



కపటానికి కరతాళధ్వనులు దక్కవచ్చు, కానీ గౌరవం దక్కదు,
సత్యానికి సమయం పట్టవచ్చు, కానీ చరిత్రలో స్థానం చెరిగిపోదు!
మనిషిగా పుట్టడం ప్రకృతి ప్రసాదించిన అపురూప అవకాశం,
మానవత్వంతో జీవించడమే జీవితానికి అసలైన సార్ధకత!

**రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# గడువులోగా పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్**

గార్ల పట్టబద్రులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో నిబంధనల మేరకు గడువులోగా ఓటును నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ పట్టభద్రులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో శ్రేణులతో కలిసి ఆయన మాట్లాడుతూ 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ లేదా దానికి సమానమైన ఏదైనా డిప్లమా, పూర్తయి ఉండాలన్నారు. పట్టభద్రుల ఓటు నమోదుకు పుట్టిన తేదీ, డిగ్రీ పాసైన సంవత్సరం నెల తేదీ, ఆధార్ కార్డు నెంబరు, ఓటర్ కార్డు నెంబరు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్, చరవాణి నెంబర్ ఈమెయిల్ ఐడి, తదితర వివరాలను నమోదుతో పాటుగా జోడించవలసి ఉంటుందన్నారు. మండల వ్యాప్తంగా అర్హత కలిగిన పట్టభద్రులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు నవంబర్ 6 లోగా నమోదు చేసుకోవాలన్నారు. ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య విషయానుసారం స్థానిక మండలానికి ఐదుగురు చొప్పున ఎమ్మెల్సీ ఓట్ల ఇన్చార్జిలను, ప్రతి గ్రామపంచాయతీలో ఇద్దరు సమన్వయం చేసే విధంగా నియమించారు. ఎమ్మెల్సీ ఓట్ల నమోదు



కోసం సంప్రదించవలసిన ఇన్చార్జిల చిరునామాలు, యేసు మల్ల రాజశేఖర్, యాకూబ్ పాషా, సర్వేష్ బాబూలాల్ నాయక్, రాజీవ్ నాయుడులను నియమించారు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బానోత్ పార్వతి హాథీరాం నాయక్, జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ శంషాద్ బేగం, రాజశేఖర్, బాబూలాల్ తదితరులు పాల్గొన్నారు.

# విడిపోవడం తప్పు కాదు!

విడిపోవడం తప్పు కాదని ప్రస్థానంతో తెలుసుకున్నా,



ఉంటున్నప్పుడు ప్రేమను పంచి వెళ్లే ముందు మౌనాన్ని మిగిల్చావు!
బంధమంటే బంధిఖానా కాదు,
బలవంతంగా నిలిపే హక్కు కాదు,
మనసులు కలిసినంత కాలమే మమతలకు నిజమైన అర్థం!
కలిసి నడిచిన దారులన్నీ కడవరకూ సాగాలని లేదు,
కలలతో కట్టిన గూళ్లన్నీ కాలమంతా నిలవాలని లేదు!
విడిపోవడం ఓటమి కాదు,
విధి రాసిన శిక్ష అసలే కాదు,
విలువ లేని బంధంలో కంటే వెలితిలో బతకడం మేలు!
మనసుకు నచ్చని చోట ముసుగేసుకొని ఉండలేము,
ఆత్మగౌరవం చంపుకుంటూ అనురాగాన్ని కాపాడలేము!
కొన్ని దూరాలు అవసరమే,
కొన్ని మౌనాలు ఔషధాలే,
కొన్ని వీడ్కోళ్లు బాధించినా కొత్త జీవితానికి తొలిమెట్లే!
వెళ్లిపోయిన వారిని తలచి వర్తమానాన్ని వదులుకోకు,
ముగిసిపోయిన కథను పట్టుకొని మిగిలిన జీవితాన్ని చెరపకు!
విడిపోవడం తప్పు కాదు,
వేదనలోనే ఆగిపోవడం తప్పు,
మనల్ని మనం కోల్పోకుండా ముందుకు సాగడమే గెలుపు!
బంధం ముగిసినా బ్రతుకు ముగియదు,
ఒక దారి మూసినా గమ్యం ఆగదు,
నిన్నటి కన్నీటిని పాఠంగా మార్చి రేపటి వెలుగులో అడుగులు వేయి!

**రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కలకలం

హైదరాబాద్,(జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి): అక్టోబర్ 21:హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి



మృతదేహం కలకలం రేపింది. కనకదుర్గ వైన్స్ సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు.మృతుడి ఎత్తు సుమారు 5.5 అడుగులు ఉండగా, సాధారణ ఛాయతో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుడివైపు పొట్ట భాగంలో నల్లటి మచ్చతో కూడిన గుర్తు ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ ఘటనపై ఆసిఫ్‌నగర్ పోలీసులు వివరాలు సేకరిస్తూ, మృతుడి గుర్తింపునకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.మృతుడిని గుర్తించినవారు లేదా అతని వివరాలు తెలిసినవారు ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

# కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలి

**బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు విజ్ఞప్తి**

నల్గొండ, (జ్యోతి ప్రభంజనం,):అక్టోబర్ 21:కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన అన్ని హామీ లను అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు బుధవారం నాడు నల్గొండ జిల్లా మిర్యాలగూడ లోని బీసీ హక్కుల సాధన సమితి కార్యాలయం లో బీసీ నాయకులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం కట్టుబడి ఉంటామని ఎన్నికల సందర్భంగా బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు బడ్జెట్లో బీసీలకు 55 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని ఆ బడ్జెట్ ను బీసీలకే ఖర్చు చేయాలని బీసీల విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ఓవర్సీస్ స్కాలర్షిప్లు అందిస్తావని నేటి ప్రభుత్వం హామీ ఇచ్చి ఉన్నదని అట్టి హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని అట్లాగే ప్రతి మండల కేంద్రంలో 50 షాపింగ్ మాల్స్ తో కూడిన బీసీ బజార్లు ఏర్పాటు చేసి చేతి వృత్తుల వారికి ఉచితంగా దుకాణాలు కేటాయిస్తాం అన్న వారు నిధులు కేటాయించాలని, జనాభాలో 56%ఉన్న బీసీలు అభివృద్ధి చెందకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని, గత దశాబ్ద కాలంగా రాష్ట్రంలో ఉన్న వివిధ బీసీ సంఘాలు మరియు బీసీ హక్కుల సాధన సమితి క్షేత్రస్థాయిలో చేసిన పోరాటం ఫలితంగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో



అరవై ఒక్క శాతం విజయం సాధించారని అది బీసీ చైతన్యానికి ప్రతీక అని జరగబోయే ఎంపీటీసీ మరియు జడ్పిటిసి ఎన్నికల్లో నైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని అందుకు రాష్ట్రంలోని బిజెపి నేతలు వారి కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి బీసీలకు న్యాయం చేసే విధంగా పోరాటం చేయాలని ఆయన సూచించారు ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి నాయకులు శ్రీనివాస్ అంజమ్మ ధనమ్మ ఉన్నారు.

# ఆలయంలో వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ.. ఇద్దరు అరెస్ట్

**వనస్థలిపురం పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదన**
**30 గ్రాముల బంగారు పుస్తెలతాడు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం**

వనస్థలిపురం,(జ్యోతి ప్రభంజనం,): అక్టోబర్ 21:ఆలయంలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని ఆమె మెడలోని



బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారైన ఇద్దరు నిందితులను వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో ఒక పురుషుడు, ఒక మహిళ ఉన్నారు. వారి నుంచి సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 18వ తేదీ ఉదయం 6.04 గంటల సమయంలో హస్తినాపురం వెంకటరమణ కాలనీలోని రాజరాజేశ్వరి ఆలయంలో ఆండుగుల రాములమ్మ (66) శుభ్రం చేస్తుండగా ఇద్దరు నిందితులు అక్కడికి చేరుకున్నారు. మహిళా నిందితురాలు వృద్ధురాలిని గట్టిగా పట్టుకుని నోరు మూయగా, పురుష నిందితుడు ఆమె మెడలో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. అనంతరం ఇద్దరూ యాక్టివా స్కూటీపై అక్కడి నుంచి వెళ్లిపోయారు.దొంగిలించిన బంగారు ఆభరణాన్ని విక్రయించేందుకు ప్రయత్నించినప్పటికీ కొనుగోలుదారులు లభించకపోవడంతో ఆంధ్రప్రదేశ్‌లోని నర్సరావుపేట సమీపంలోని నడికుడి రైల్వే స్టేషన్ వద్ద స్కూటీని పార్కింగ్ చేసి రైలులో హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు.చచ పోలీసుల వలలో నిందితులుఈ కేసును సీరియస్‌గా తీసుకున్న వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి, అక్టోబర్ 21వ తేదీ ఉదయం వనస్థలిపురంలోని కమలానగర్‌లో ఓ నగల దుకాణం సమీపంలో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బంగారు పుస్తెలతాడుతో పాటు ఒక రియల్‌మీ, ఒక వివో వై-31 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన నిందితులను అన్నపు రెడ్డి దుర్గ రమణరెడ్డి (23), తెంక వరలక్ష్మి (24)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ గుర్రంగూడలోని ఎస్‌జేఆర్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. పురుష నిందితుడు వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా, మహిళా నిందితురాలు ప్రైవేట్ హాస్టల్‌లో వంట పని చేస్తున్నట్లు వెల్లడించారు.చచ ఒంటరిగా ఉన్న వృద్ధులే లక్ష్యందర్యాప్తులో భాగంగా నిందితులు ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నట్లు



పోలీసులు తెలిపారు. మహిళా నిందితురాలు బాధితురాలిని పట్టుకుని నోరు మూయగా, పురుష నిందితుడు బంగారు ఆభరణాలను లాక్కుని పారిపోయేవాడని పేర్కొన్నారు. చోరీ చేసిన ఆభరణాలను విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పాల్పడినట్లు వెల్లడించారు.పోలీసు అధికారుల పర్యవేక్షణలో కేసు ఛేదనమల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్, ఎల్బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్ పర్యవేక్షణలో వనస్థలిపురం ఏసీపీ టి. కరుణాకర్ రావు,ఆధ్వర్యంలో లో ఎస్ హెచ్ ఓ ఎస్. రవి బాబు, డీ ఐ రాజేష్,రవి, మల్లయ్య,పోలీసు సిబ్బంది, క్రైమ్ పోలీసుల బృందం ఈ కేసును ఛేదించింది. నిందితులను అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# కర్మన్‌ఘాట్‌లో అంగరంగ వైభవంగా దసరా మహోత్సవాలు

ఎల్ బీ నగర్,(జ్యోతి ప్రభంజనం,)::కర్మన్‌ఘట్ క్రాంతి యువజన సంగం ఆధ్వర్యంలో కర్మన్‌ఘాట్‌లోని రామలీలా మైదానంలో దసరా మహోత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తిశ్రద్ధలు, సాంప్రదాయ వైభవం నడుమ నిర్వహించిన ఈ వేడుకలకు స్థానిక ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేశారు.దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజల సందడితో రామలీలా మైదానం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో క్రాంతి యువజన సంగం కమిటీ సభ్యులు బండారి కిషోర్ రెడ్డి, సుంకరి రమేష్ గౌడ్, చేగోని విఠల్ గౌడ్, చీర సత్యనారాయణ, గొరిగె బాబు గౌడ్, పాలెం శేఖర్ గౌడ్, చేగోని శ్రీనివాస్ గౌడ్, సూర్వి సాయి గౌడ్, రాచకొండ శ్రీనివాస్, గొరిగె సురేష్, చీర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.దసరా మహోత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించిన కర్మన్‌ఘాట్ ప్రజలకు, భక్తులకు,



మహిళలకు, యువతకు మరియు ప్రతి ఒక్కరికీ క్రాంతి యువజన సంగం కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు.. యువతకు సామాజిక కార్యకర్త రాపోలు లింగస్వామి పిలుపు**



ఎల్ బీ నగర్,(జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి)::గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు ఉచిత నైపుణ్య శిక్షణ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని, జ్యోతి ప్రభంజనం పత్రిక సంపాదకులు,సామాజిక కార్యకర్త, ఆర్‌టీఐ రక్షక్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు లింగస్వామి పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా ఆదరణ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఎమర్జెన్సీ కేర్ అసిస్టెంట్, సీఎస్ఎస్‌డీ అసిస్టెంట్ కోర్సుల్లో ఆరు నెలల పాటు శిక్షణ అందించనున్నట్లు వివరించారు.శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు కంప్యూటర్ నైపుణ్యాలు, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ నైపుణ్యాల్లోనూ శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు ధ్రువపత్రాలతో పాటు ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు పొందేందుకు సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు.18 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల అర్హులైన గ్రామీణ యువతీ యువకులు ఈ అవకాశంపై ఆసక్తి చూపాలని, తమ విద్యార్హతలకు అనుగుణంగా కోర్సులను ఎంచుకుని ఉపాధి దిశగా ముందడుగు వేయాలని లింగస్వామి సూచించారు. ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత శిక్షణ పొందలేకపోతున్న నిరుద్యోగ యువతకు ఇటువంటి ఉచిత శిక్షణ కార్యక్రమాలు ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు.శిక్షణ వివరాలకు సంప్రదించండి:× ఆదరణ సొసైటీ, రోడ్ నంబర్ 2, కృష్ణానగర్ కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్. ఫోన్ నంబర్లు: 9550553512, 7337382558, 9849411941.గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యవంతులుగా ఎదిగి, స్వయం సమృద్ధి సాధించడంతో పాటు తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని రాపోలు లింగస్వామి ఆకాంక్షించారు.

# గ్రామీణ నిరుద్యోగ యువతకు శుభవార్త

**డీడీయూ జీకేవై ద్వారా ఉచిత శిక్షణ.. ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు**




హైదరాబాద్,:(జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి):తెలంగాణలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకు లకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదరణ సొసైటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు శిక్షణ అనంతరం ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ తెలిపింది.ఆరు నెలల పాటు ఉచిత శిక్షణ ఈ పథకం కింద రెండు కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు.మొదటి కోర్సు ఎమర్జెన్సీ కేర్ అసిస్టెంట్, రెండో కోర్సు,సీఎస్ఎస్‌డీ అసిస్టెంట్ రెండు కోర్సులకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఆరు నెలల పాటు వసతితో కూడిన శిక్షణ అందించనున్నట్లు సంస్థ వివరించింది.శిక్షణలో ప్రత్యేక సదుపాయాలుఅభ్యర్థులకు శిక్షణ కాలంలో స్టడీ మెటీరియల్, యూనిఫాం ,హాస్టల్,భోజన సదుపాయాలను ఉచితంగా అందించనున్నారు. బాలబాలికలకు వేర్వేరుగా వసతి కల్పించనున్నారు. సర్టిఫైడ్ ట్రైనర్ల ద్వారా శిక్షణతో పాటు కంప్యూటర్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ నైపుణ్యాల్లోనూ ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రం అందించడంతో పాటు ఆసుపత్రుల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సహకరిస్తారు.అర్హతలు ఇవే..18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా లేదా ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని సంస్థ పేర్కొంది.ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, బీసీ వర్గాల అభ్యర్థులకు ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని తెలిపింది. అయితే, తుది అర్హతలు, ఎంపిక నిబంధనలను శిక్షణ కేంద్రంలో నిర్ధారించుకోవాలి.దరఖాస్తుకు అవసరమైన పత్రాలుఅభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ధ్రువపత్రాలు, బ్యాంకు పాస్‌బుక్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను సిద్ధం చేసుకోవాలి.వివరాలకు సంప్రదించండిఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, కృష్ణానగర్ కాలనీలో ఉన్న ఆదరణ సొసైటీ అధీకృత శిక్షణ కేంద్రాన్ని సంప్రదించవచ్చు. ఫోన్: 9550553512, 7337382558, 9849411941 చిరునామా:ఆదరణ సొసైటీ, హెచ్.నెం. 11-5-91/74, రోడ్ నెం. 2, కృష్ణానగర్ కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్-500035.గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సంస్థ సూచించింది.

# ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నల్గొండ పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయ మైనవని జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్నారు. అక్టోబర్ 21 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దేశ రక్షణ కోసం, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ ఐఏఎస్,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్‌తో పాటు,అమరవీరుల కుటుంబ సభ్యులు,అధికారులు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్ ఐఏఎస్ మాట్లాడుతూ, ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు





పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం, కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. నేరాల నియంత్రణ, మహిళలు, బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీస్ విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది అమరులయ్యారని, దేశవ్యాప్తంగా ఈ ఏడాది 154 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేశారని ఎస్పీ తెలిపారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు ఎప్పటికీ మరచిపోలేనివని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులందరికీ ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు గౌరవాభివందనాలు తెలియజేశారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల భద్రత, సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, డీఎస్పీ కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీస్ అధికారులు,సిబ్బంది, పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ పోలీస్ స్టేషన్లలో తుప్పుపడుతున్న వాహనాలు!

### వానకు తడిసి.. ఎండకు ఎండి.. మట్టిలో కలిసిపోవాల్సిందేనా?

### ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చేలా పట్టుబడిన వాహనాలకు వేలంపాట నిర్వహించాలి

చౌటుప్పల్, అక్టోబర్ 21 చౌటుప్పల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కారణాలతో పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడి ఉంటున్నాయని, వాటిని పట్టించుకునే వారు కరువయ్యారని సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను ఆయా పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉంచుతున్నారు. అయితే కొన్ని వాహనాలు సంవత్సరాల తరబడి అక్కడే ఉండిపోవడంతో ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వారు పేర్కొంటున్నారు.ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంటున్న వాహనాలు!వివిధ కేసులు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, ఇతర కారణాలతో పోలీసులకు పట్టుబడిన వాహనాలను సంబంధిత యజమానులు తీసుకెళ్లకపోవడం లేదా కేసులకు సంబంధించిన ప్రక్రియలు పూర్తికాకపోవడం వంటి కారణాలతో పోలీస్ స్టేషన్లలో ఉంచుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇలా నిల్వ ఉన్న వాహనాలపై సకాలంలో నిర్ణయం తీసుకోకపోతే అవి క్రమంగా తుప్పుపట్టి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని సామాజిక కార్యకర్తలు



అభిప్రాయపడుతున్నారు.ప్రజల భద్రత, చట్టపరమైన చర్యల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీస్ స్టేషన్లలో ఉంచడం అవసరమే అయినప్పటికీ, వాటి నిర్వహణ, భద్రపరచడం, కేసుల పరిష్కారం అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించాలి!పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, వాటి యజమానులను గుర్తించి, వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. వాహనాలపై పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టు ఆదేశాలు, యాజమాన్య హక్కులు తదితర అంశాలను పరిశీలించి, చట్టపరంగా పరిష్కారం సాధ్యమైన వాహనాలను యజమానులకు అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.అదేవిధంగా యజమానులు గుర్తించబడని లేదా చట్టపరమైన ప్రక్రియ పూర్తయినప్పటికీ నిరుపయోగంగా ఉన్న వాహనాల విషయంలో సంబంధిత నిబంధనలకు అనుగుణంగా



తదుపరి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పూర్తిగా పాడైపోయిన వాహనాలను కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన అనుమతులతో వేలం లేదా తుక్కు రూపంలో విక్రయించే అవకాశాలను అధికారులు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలి!ఏళ్ల తరబడి పోలీస్ స్టేషన్లలో వాహనాలు నిలిచిపోవడం వల్ల వాటి విలువ తగ్గిపోవడమే కాకుండా, పోలీస్ స్టేషన్ ప్రాంగణాల్లో స్థలం కూడా ఆక్రమించబడుతోంది. సకాలంలో చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటే ఉపయోగపడే వాహనాలను యజమానులకు అప్పగించడంతో పాటు, నిబంధనల ప్రకారం వేలం నిర్వహించదగిన వాహనాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు.చౌటుప్పల్ పట్టణంలో పట్టుబడిన వాహనాలపై ఇప్పటివరకు వేలంపాట నిర్వహించినట్లు తమ దృష్టికి రాలేదని వారు చెబుతున్నారు. అయితే ఈ అంశంపై సంబంధిత అధికారుల రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించాలి! చౌటుప్పల్ పోలీస్ స్టేషన్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో నిల్వ ఉన్న వాహనాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక సమీక్ష నిర్వహించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఎన్ని వాహనాలు ఉన్నాయి? ఎన్ని సంవత్సరాలుగా నిల్వ ఉన్నాయి? ఎన్ని వాహనాలకు సంబంధించిన కేసులు పరిష్కారమయ్యాయి? ఎన్ని వాహనాలను యజమానులకు అప్పగించవచ్చు? ఎన్ని వాహనాలపై చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది? అనే వివరాలను సేకరించి పారదర్శకమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజాధనం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి, నిరుపయోగంగా మారుతున్న వాహనాల విషయంలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని సామాజిక కార్యకర్తలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# దుర్గాదేవి రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

### ఘనంగా దుర్గా శరన్నవరాత్రుల ముగింపు వేడుకలు



చౌటుప్పల్, అక్టోబర్ 21 చౌటుప్పల్ పట్టణంలోని భవానీనగర్‌లో ఉన్న శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గా శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం దుర్గాదేవి రాజరాజేశ్వరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మోగుదాల పావని రమేష్ గౌడ్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి చీరల వేలంపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు ఉత్సాహంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలుఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించగా, ముగింపు రోజున రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారి దర్శనం భక్తులను ఆకట్టుకుంది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఒడిబియ్యం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. దుర్గా శరన్నవరాత్రుల ముగింపు వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు, భక్తులుఈ కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తలు వర్కాల రవి గౌడ్, ఆవుల యేసు యాదవ్, పుణ్యవతి దంపతులు, దాడి యశ్వంత్ రెడ్డి, గగులోతు అరుణా శంకర్ నాయక్, మాజీ ధర్మకర్త ఉప్పల కృష్ణ?కుసుమ దంపతులు, బొబ్బిళ్ళ శ్రీరాములు, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, సుర్వి నర్సింహా గౌడ్, బుడిగె బాలకృష్ణ గౌడ్, ఉప్పల దీపిక?కేదార్నాథ్ దంపతులు, దాడి పద్మ, మామిడి



రాములు?వెంకటమ్మ దంపతులు, డాకోజీ శ్రీనివాస్?సంతోష, గడ్డిపాటి విజయలక్ష్మి, తేలు కుంట్ల వసంత, ఎర్రగోని భాస్కర్, అన్నమోని నవనీత, బొబ్బిళ్ళ సామ్రాట్, గంజి నాగరాజు, కాసోజు మధు, సోను నాయక్, రోహిత్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారికి వెండి కత్తిని వితరణ గావించిన నంబూరి యతీష్.

గార్ల ఎన్నారై నంబూరి యతీష్ గార్ల మద్రిగూడెం శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారికి వెండి కత్తిని వితరణ గావించారు. మంగళవారం మండల పరిధి కోరిన కోరికలు తీర్చే శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారికి, దక్షిణ ఆఫ్రికాలో ఉద్యోగం చేస్తున్న నంబూరు యతీష్ రూ 62 వేల విలువకలిగిన వెండి కత్తిని వారి బంధువుల ద్వారా ఆలయంలో పూజలు నిర్వహించి సమర్పించారు.వితరణ గావించిన నంబూరి యతీష్ బంధుగణం శాస్త్రబద్ధంగా శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించి ఆలయ నిర్వహకులకు అందజేశారు.ఈనెల 24 నుంచి 31 వరకు శ్రీ వేట వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులు, దాతలు ఆలయ అభివృద్ధికి సహకరించవలసిన ఆవశ్యకత ఉన్నది. అర్చకులు పూజలు అనంతరం ఇతర భావించిన నంబూరి యతీష్ ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. ఈ కార్యక్రమంలో పరుచూరి కుటుంబరావు దంపతులు, దాత బంధుగణం పాల్గొన్నారు.




printed and published by Rapolu Lingaswamy,onbehalf of printed at SMILYS ONLINE 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana Editor: Rapolu Lingaswamy.pone:9908103501, PRGI NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com